నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, గురువారం 18 జనవరి 2024 | HYDERABAD




**పల్లె నుంచి పట్నానికి..** సంక్రాంతి సెలవులు ముగియడంతో పండక్కి ఊరెళ్లినవారంతా తిరిగి నగరానికి వస్తున్నారు. బుధవారం ఔటర్ రింగ్ రోడ్ నుంచి గచ్చిబౌలి శిల్పాప్లైవోర్ వద్ద నగరానికి బారులు తీరిన వాహనాలు



## కోకిల విలవిల

### చైనా మాంజా చుట్టుకొని..

కందుకూరు మండల పరిధి లోని జైత్వారంలో ఓ చెట్టుపై చైనా మాంజా చుట్టుకుని విలవిలలాడు తున్న కోకిలను రక్షించిన మాజీ సర్పంచ్ పర్వతాల్ యాదవ్

-కందుకూరు. జనవరి 17

## ఆఫ్టర్ 9.. అంతా రచ్చ

### పబ్ నిర్వాహకుడు సహా ఐదుగురి అరెస్ట్

బంజారాహిల్స్, జనవరి 17: అనుమతులు లేకుండా డీజే నడిపిస్తున్న ఆఫ్టర్ 9 పబ్ నిర్వాహకుడితో పాటు మరో నలుగురు వ్యక్తులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నం 14లోని ఆఫ్టర్ 9 పబ్‌లో రెండు రోజుల క్రితం బర్త్ డే పార్టీలో యువకుల మధ్యన జరిగిన గొడవలో నవీద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేసిన పోలీసుల పరిశీలనలో అమ్యూజ్‌మెంట్ లైసెన్స్ లేకుండానే డీజే నడిపిస్తున్నట్లు తేలింది. దీనికి తోడు అసభ్యకర ప్రవర్తనకు పాల్పడుతున్న యువతులను పబ్‌లోకి అనుమతించి న్యూసెన్స్‌కు కారణమవుతున్నట్లు గుర్తించారు. దీంతో ఆఫ్టర్ 9 పబ్ భాగస్వామి శివలాల్, లీజుదారుడు వేణుగోపాల్, బౌన్సర్లు కేశవ్, ప్రశాంత్, సాయికుమార్, శేఖర్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం శివలాల్, బౌన్సర్లు కేశవ్, ప్రశాంత్, సాయికుమార్, శేఖర్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు.

## ఫిబ్రవరి 14న హైసియా సదస్సు

సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : హైసియా (హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో 31వ నేషనల్ సమ్మిట్, అవార్డుల కార్యక్రమాన్ని ఫిబ్రవరి 14న మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఏడాది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నేపథ్యంలో 'విల్ ఏఐ బిల్డ్ ఏ బెట్టర్ వరల్డ్' పేరుతో జాతీయ సదస్సు ఉంటుందన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన కంపెనీలకు అవార్డుల ప్రదానం చేస్తామని తెలిపారు. వివరాలకు https://lnkd.in/gjJNWh9U లో సంప్రదించాలని తెలిపారు.



నాగార్జున సాగర్ (ఫైల్)

# తాగునీటికీ కటకటే?

సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : మహానగర ప్రజల తాగునీటి సరఫరాలో ముఖ్యభూమిక పోషిస్తున్న కృష్ణా జలాల నీటి నిల్వలపై జలమండలిలో ఆందోళన నెలకొన్నది. కృష్ణా బేసిన్‌లో ఈ ఏడాది సరైన వరద నీరు లేకపోవడంతో రాబోయే ఆరు నెలల పాటు డిమాండ్‌కు తగ్గట్లుగా కృష్ణా నీటిని అందించడం ఎలా అని అధికారుల్లో తర్జనభర్జన మొదలైంది. నాగార్జున సాగర్‌లో 510 అడుగుల నీటిమట్టం ఉంటేనే ఎలిమినేటి మాధవ రెడ్డి ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌కు తాగునీటిని అందించడానికి ఎత్తిపోతల సాధ్యమవుతుంది. అంతకంటే నీటి మట్టం తగ్గినట్లయితే అక్కడ పంపులను నడపడం సాధ్యం కాదు. ప్రస్తుతం సాగర్‌లో 521 అడుగుల నీటిమట్టం ఉంది. ఇదే తరుణంలో రెండు తెలుగు రాష్ట్రాల నీటి అవసరాలకుగాను 505 అడుగుల వరకు నీటిని వినియోగించుకునేందుకు ఒప్పందం కూడా జరగింది. ఈ క్రమంలోనే జలమండలి సాగర్‌లో 510 అడుగులు కచ్చితంగా మెయింటెన్ చేయాలని ఇరిగేషన్ శాఖకు లేఖ రాశారు. ఒక పక్క లేఖ రాస్తూనే మరో పక్క సాగర్ ఫోర్‌షోర్‌లో అత్యవసర మోటార్లు ఏర్పాటు చేసి హైదరాబాద్‌కు నీటిని అందించే ప్రక్రియపై కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు దాదాపు రూ. 2 కోట్లతో అత్యవసర పంపింగ్‌కు టెండర్లు పిలిచేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. షార్ట్ టెండర్ ప్రక్రియను త్వరగా ముగించి రాబోయే ఆరు నెలల పాటు అత్యవసర పంపింగ్ ద్వారా సాగర్ నుంచి నగరానికి మూడు దశల ద్వారా రోజూ 270 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్ ఫర్ డే) నీటిని తరలించేందుకు సిద్ధమవుతున్నారు. 2017 సంవత్సరంలో అత్యవసర పంపింగ్ ద్వారా సాగర్ నుంచి నీటి జలాలను తరలించినట్లు అధికారులు గుర్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే వానకాలంలో నాగార్జునసాగర్‌కు జూలై, ఆగస్టుల్లో వరద వచ్చే అవకాశాలున్నాయి. అంటే దాదాపు ఏడెనిమిది నెలల పాటు ఉన్న నీటి నిల్వలతోనే సరిపెట్టుకోవాలి. ఏపీ ధోరణి చూస్తుంటే కనీసంగా 15 టీఎంసీల నీటినైనా వాడుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో రానున్న వేసవిలో అత్యవసర మోటార్లు తప్పవనే వ్యాఖ్యలు అధికార వర్గాల్లో వినిపిస్తున్నాయి.

- సాగర్ నీటి నిల్వలపై జలమండలిలో ఆందోళన
- 510 అడుగులు మెయింటెన్ చేయాలని ఇరిగేషన్‌కు లేఖ
- మరో పక్క రూ.2కోట్లతో అత్యవసర పంపింగ్‌నకు ఏర్పాట్లు
- 2017 తర్వాత ఎమర్జెన్సీకి పంపింగ్ వైపు అడుగులు
- వేసవిలో రోజూ 270 ఎంజీడీల నీటి తరలింపు అధికారులకు సవాల్

### 20, 21వ తేదీల్లో నీటి సరఫరా బంద్

మహానగరానికి తాగునీరు సరఫరా చేస్తున్న కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లయి ఫేజ్-1లో మిరాలం, అలియాబాద్ ఆఫ్ టేక్ ప్రాంతం వద్ద నున్న 1200 ఎంఎం డయా ఎంఎస్ గ్రావిటీ మెయిన్ పైపులైన్‌కు జంక్షన్ పనులు చేపడుతున్నారు. చాంద్రాయణగుట్టలోని సన్నీ గార్డెన్ నుంచి షోయబ్ హోటల్ వరకు బాక్స్ డ్రెయిన్ పనులకు ఇబ్బందుల్లేకుండా ఈ జంక్షన్ పనులు చేస్తున్నారు. 20వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 21వ తేదీ ఉదయం 6 గంటల వరకు ఈ పనులు జరుగుతాయని అధికారులు వెల్లడించారు. ఈ 24 గంటల పాటు పలు రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. మిస్రిగంజ్, బహదూర్‌పుర, కిషన్‌బాగ్, జహనుమా, మొఘల్‌పుర, దారుల్‌షిఫా, సుల్తాన్ షాహీ, పత్తర్‌గట్టి, అల్లుబైల్ కాలనీ, ఆలియాబాద్, గౌలిపుర, తలబ్ కట్ట, రియాసత్‌నగర్ ప్రాంతాలలో నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు కోరారు.

### మిగతా రిజర్వాయర్లలో పుష్కలం

కోటి 20 లక్షల జనాభాకు పైబడిన హైదరాబాద్ మహానగరంలో జలమండలి వివిధ రిజర్వాయర్ల నుంచి రోజూ 555 నుంచి 560 ఎంజీడీల మేర నీటిని తరలిస్తూ ప్రజలకు రోజూ విడిచి రోజూ నీటిని సరఫరా చేస్తున్నది. కృష్ణా నుంచి 270 ఎంజీడీలు, గోదావరి నుంచి 160, సింగూరు, మంజీరాల నుంచి 103 , ఉస్మాన్‌సాగర్ నుంచి 14 ఎంజీడీల నీటిని తరలిస్తున్నారు. హిమాయత్‌సాగర్ నుంచి ప్రస్తుతం నీటి సేకరణ జరగడం లేదు. డేడ్‌కేటెడ్ స్టోరేజీగా హిమాయత్‌సాగర్‌ను ఉంచినప్పటికీ వచ్చే వేసవిలో అవసరాల మేరకు ఈ రిజర్వాయర్ నుంచి పాతనగరానికి నీటిని అందించి కృష్ణా జలాల ప్రాంతాలకు సర్దుబాటు చేయనున్నారు. ఒక్క కృష్ణా జలాలు తప్ప అన్ని రిజర్వాయర్లలో సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని, కృష్ణా జలాలను సమర్థవంతంగా తరలిస్తామని అధికారులు తెలిపారు. మొత్తంగా ప్రతి ఏడాది 50 ఎంజీడీల అదనపు నీటిని తరలించి వేసవి డిమాండ్‌ను గట్టెక్కే పరిస్థితి నుంచి ఈ సారి అదనపు జలాలు లేక నీటి కష్టాలు తప్పవన్న సంకేతాలు కనబడుతున్నాయి.

# రోజూ 2 గంటలు కరెంటు కోతలు


## మరమ్మతుల పేరిట విద్యుత్ నిలుపుదల

### జనవరి 17 నుంచి ఫిబ్రవరి 10 వరకు షెడ్యూలు విడుదల

### శీతాకాలం కోతలపై సోషల్ మీడియాలో ఫిర్యాదు వెల్లువ

### గందరగోళంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ

సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : శీతాకాలంలోనే విద్యుత్ మరమ్మతుల పేరిట అధికారికంగా రోజూ 2 గంటలు విధిస్తున్న కరెంటు కోతలపై నగర వాసులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వేసవిలో నిరంతరం నాణ్యమైన కరెంటు సరఫరా కోసం అంటూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫరూఖీ విడుదల చేసిన మరమ్మతుల ప్రణాళికపై మండిపడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో విద్యుత్ మరమ్మతులు చేపట్టినా ఇలాంటి పరిస్థితి లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరెంటు కోతలు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రెండు రోజుల కిత్రం జనవరి 17నుంచి ఫిబ్రవరి 10 వరకు గ్రేటర్‌లోని 9 సర్కిళ్ల పరిధిలో 2 గంటలు కరెంటు కోతలు ఉంటాయనడంతో సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశం అయింది. బుధవారం కరెంటు కోతలపై సోషల్ మీడియాలో పలువురు వినియోగదారులు పోస్టు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారప్ అలీ ఫరూఖీకి ట్యాగ్ చేస్తూ పోస్టులు చేస్తూనే ఉన్నారు. మరమ్మతుల షెడ్యూలు ప్రకటించిన ప్రాంతాలే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరా అంతరాయం ఉన్నట్లు వినియోగదారులు పేర్కొంటున్నారు.





### నేడు 125 ఫీడర్స్ పరిధిలో..

గురువారం మొత్తం 125 ఫీడర్ల పరిధిలో మరమ్మతులు ఉంటాయని అధికారులు తెలిపారు. ఇందులో బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్, సికింద్రాబాద్, మేడ్చల్, హబ్సీగూడ, సైబర్ సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లలో 11 కేవీ ఫీడర్లు మొత్తం 2352 ఉన్నాయి. అందులో 125 ఫీడర్ల పరిధిలోనే విద్యుత్ లైన్ల మరమ్మతుల వల్ల కనిష్ఠంగా 30 నిమిషాల నుంచి గరిష్ఠంగా 2 గంటల పాటు విద్యుత్ కోతలు విధిస్తామని అధికారులు తెలిపారు.

### ట్వీట్‌లలో మచ్చుకు కొన్ని..

- శంకర్‌మఠ్ పవర్ స్టేషన్ పరిధిలో 2గంటల కంటే ఎక్కువ సమయం విద్యుత్ కోత ఏర్పడింది. ప్రతి 30 నిమిషాల తర్వాత పవర్ కట్ సమస్య ఉంది. ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్ (9490619768)కు ఫోన్ చేస్తే ఎటువంటి ప్రతిస్పందన లేదు. దయచేసి త్వరగా పునరుద్ధరించండి.' అంటూ జీషాన్ అహ్మద్ ట్వీట్ చేశారు.
- 3గంటలకు పైగా కరెంటు కోత ఉంది. ఏం జరుగుతోంది? కరెంటు కోతలు ఎందుకు వస్తున్నాయి? అంటూ సయ్యద్ సలార్ ట్వీట్ చేశారు.
- భారతి నిలయం వద్ద 2 గంటలకు పైగా కరెంటు లేదు. ఏదైనా సమస్య ఉందా? 1-9-202/ఇ/1/డి/1 రాంనగర్, పార్సిగుట్టలో ఉంటాను. దయచేసి అప్‌డేట్ చేయండి' అంటూ మాచర్ల శివానీ ట్వీట్ చేశారు.
- మా ఏరియాలో కరెంటు కోత పెట్టి 2.5 గంటలైంది. మెయిన్‌టెనెన్స్ కారణంగా పవర్ కట్ అవుతుందని నాకు తెలుసు, కానీ అధికారులు రోజు మొత్తం మెయింటెనెన్స్ చేయాలనుకోవడం నాకు ఆశ్చర్యంగా ఉంది? అని సతీశ్ కుమార్ ట్వీట్ చేశారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న 10వ బెటాలియన్ డిజాస్టర్ ఫోర్స్ సిబ్బంది

## అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్

సిటీబ్యూరో, జనవరి 17 (నమస్తే తెలంగాణ)/మేడ్చల్ కలెక్టరేట్ : అగ్ని ప్రమాద సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 12 నుంచి 17వరకు ఈవీడీఎం ఆధ్వర్యంలో ఆర్సీ పురం డీమార్ట్, కూకట్‌పల్లి చెన్నై షాపింగ్ మాల్, అత్తాపూర్ సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఎస్‌డి రోడ్ భవన మల్టీస్టోరేజ్ కాంప్లెక్స్, ఎల్బీనగర్ లక్ష్మీ పద్మశాలీ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ మార్కెట్‌తో పాటు 19 చోట్ల అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. భవన నిర్మాణ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకున్నామని, పార్కింగ్ పాలసీకి విరుద్ధంగా ఉన్న 26 వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకున్నట్లు ఈవీడీఎం అధికారులు తెలిపారు. ఈవీడీఎం సేవలపై 040-29555500, 9000113667 నంబర్‌కు వాట్సాప్ చేయాలని తెలిపారు. ఇదిలా ఉంటే మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ విజయేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో 10వ బెటాలియన్ డిజాస్టర్ ఫోర్స్ సీబీఆర్ఎం మాక్ డ్రిల్ నిర్వహించింది. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ దామోదర్ సింగ్, ఇన్‌స్పెక్టర్ గౌతమ్ కుమార్ బృందం, డీఆర్‌వో హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.





**సింహం దత్తత** జూ పార్క్‌లోని ఆఫ్రికన్ లయన్ (మనోహర్)ను సంవత్సరం పాటు దత్తత నిమిత్తం రూ.3 లక్షల చెక్‌ను బుధవారం జూ పార్క్ క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్ హిరేమత్‌కు అందజేస్తున్న బొల్లారం అరేజిన్ ఫార్మాస్యూటికల్ కంపెనీ ప్రతినిధులు దీపక్, సత్యనారాయణ గిరి తదితరులు, ఇన్‌సెట్‌లో ఆఫ్రికన్ లయన్ మనోహర్

- చార్మినార్, జనవరి 17



**నాట్య మయూరాలు**

మాదాపూర్ శిల్పారామంలో బుధవారం ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు

## మైనర్ ర్యాష్ డ్రైవింగ్ తండ్రిపై కూడా కేసు

బంజారాహిల్స్, జనవరి 17 : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కారు నడిపిస్తూ ర్యాష్ డ్రైవింగ్ చేసిన మైనర్‌తో పాటు అతడికి కారు ఇచ్చిన తండ్రిపై కూడా జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎర్రగడ్డకు చెందిన బంజరంగ్ అగర్వాల్ కొడుకు (17) మూడురోజుల క్రితం మెహదీపట్నం నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నం 51వైపునకు కారులో అతివేగంగా వెళ్తూ జీహెచ్ఎంసీ డంప్ యార్డ్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టగా కారు నడిపిన అబ్బాయికి లైసెన్స్ లేదని తేలింది. కారు అతడి తండ్రి భజరంగ్ అగర్వాల్ పేరుతో ఉంది. దీంతో ర్యాష్ డ్రైవింగ్ చేసిన కొడుకుతో పాటు తండ్రిపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.

### బ్యాడ్ డ్రైవర్స్ ఆఫ్ హైదరాబాద్..

నగరంలోని పలు ప్రాంతాల్లో అతివేగంగా ఖరీదైన కార్లను నడిపిస్తున్న దృశ్యాలను బ్యాడ్ డ్రైవర్స్ ఆఫ్ హైదరాబాద్ పేరుతో ఉన్న ట్విట్టర్ అకౌంట్స్‌లో పోస్ట్ చేస్తున్నారు. దీనిపై దృష్టి పెట్టిన ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ కానిస్టేబుల్ తిప్పాజీ ఈ అకౌంట్‌లోని వీడియోలను పరిశీలించారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం 45 నుంచి చెక్‌పోస్ట్ వైపునకు ఓ కారు మితిమీరిన వేగంతో వెళ్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. బుధవారం కారును సీజ్ చేసి కారు నడిపిస్తున్న కొవ్వూరి సాయి రెడ్డిని అదుపులోకి తీసుకుని నోటీసులు జారీ చేశారు. మరోఘటనలో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి కేబీఆర్ పార్కు వైపునకు జిగ్‌జాగ్ డ్రైవింగ్‌తో వెళ్తున్న కారును గుర్తించి కానిస్టేబుల్ తిప్పాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కారు బంజారాహిల్స్ రోడ్ నం 7లోని రిచ్ మౌంట్ వెంచర్స్ సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్‌గా ఉన్న మ్యాడమ్ కార్తికేయ పేరుతో ఉన్నట్లు తేలింది. కాగా ట్విట్టర్‌లోని వీడియో 2నెలల క్రితం తీసిందని, కారును తానే నడిపానని ఏడుకొండలు అనే డ్రైవర్ బుధవారం పోలీసుల వద్దకు వచ్చాడు. అయితే కారు నడిపింది ఎవరు అనే దానిపై పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు.

